



# చిన్ని..చిన్ని..ఆశ

## ఉమాదేవి

ఆ రోజు సాయంత్రం కొడుకు చెప్పిన వార్త విని పులకించిపోయింది శాంతమ్మ. ఎన్నాళ్లో తన మనసులో తిష్ట వేసుకుని కూర్చున్న కోరిక తీరబోతోంది! చిగురాశగా మొదట్లో జనించి క్రమక్రమంగా బలమైన కోరికగా రూపుదిద్దుకుని తర్వాత, తర్వాత పెచ్చుపెరిగి తన సుదీర్ఘ జీవనయానంలో మనసంతా ఆక్రమించుకుని ఎలాగైనా సాధించి తీరాలనే బలమైన నిశ్చయాన్ని జోడు చేసుకుని నిత్యమూ మధన పెట్టే కోరిక తీరేందుకు అంకురార్పణ జరిగింది. చిన్న పిల్లలా గంతులెయ్యాలని మనసు ఆరాటపెడుతోంది.

కొడుకిచ్చిన రశీదు అందుకుంటూండగా ఆమె చేతులు వణికాయ్. అప్రయత్నంగా కళ్లు చెమ్మగిల్లాయి. మౌనంగా తన గదిలోకెళ్లి మంచం మీద వాలిపోయింది. దిండు కింద రశీదు భద్రపరుచుదామనుకుని దిండు ఎత్తేసరికి చిన్ననాటి స్నేహితురాలు కౌసల్య దగ్గర నుండీ కొద్ది రోజుల క్రితమే వచ్చిన పోస్టుకార్డు చేతికి తగిలింది. మరోసారి ఆ కార్డు చదువుకుని రశీదుతో పాటు కార్డుని కూడా దిండు కింద భద్రపరచి సీలింగ్ వైపు చూస్తూ కళ్లు మూసుకుంది. సినిమా రీళ్లలా గతం స్మృతి పథంలో మెదిలింది.

* * *

కలవారి అమ్మాయి కౌసల్య. హైస్కూలు చదువు వరకూ శాంతా, కౌసల్యా కలిసే చదివారు. మంచి శరీర ఛాయ, కోలముఖం, పొందికైన అవయవ సౌష్ఠవంతో చూపరులను ఆకట్టుకునే విగ్రహం కౌసల్యది. దానికి తోడు ఎప్పుడూ ఖరీదైన దుస్తులతో ఉండడం వలన ఎంతో ఆకర్షణీయంగా కనిపించేది. అందుకు అసూయపడేది కాదు శాంత. కానీ, తన పేదరికాన్ని ఏదో మిషతో ఎత్తి చూపెట్టడానికే ఎప్పుడూ ప్రయత్నించే కౌసల్యంటే ఒక విధమైన నిరసన భావం ఉండేది శాంతకు. అయితే, సన్నిహితుల కంటే శత్రువులనే పదేపదే తలచుకునే తత్వం హిరణ్యకశిపుని కాలం నుండీ వస్తున్నదే! శాంత ఎప్పుడూ కౌసల్యనే తలుచుకునేది. కౌసల్య వేసుకునే దుస్తులనూ, ఆభరణాలనూ పరికించి చూస్తూ ఉండేది. ఎప్పుడూ చిన్నతనం నుండీ పల్లె వాతావరణానికే పరిమితమైపోయిన ఆ అమ్మాయి దృష్టిలో కౌసల్య ఒక అందమైన రాజకుమారి. ఒక్క రోజు కౌసల్య క్లాసుకి రాకపోయేసరికి ఏదో పోగొట్టుకున్న భావన కలిగేది ఆమెలో.

ఆ ఊళ్లో కాలేజీ లేకపోవడం వలన హైస్కూలు చదువులయ్యాక కొన్నాళ్లకి ఇద్దరికీ పెళ్లిళ్లు జరిగిపోయాయి. వారి వారి తాహతుకు తగ్గ సంబంధాలే కుదిరాయి. శాంత కంటే కొన్ని నెలలు ముందు జరిగింది కౌసల్య పెళ్లి. కౌసల్య తన పెళ్లికి చేయించిన నగలు ప్రత్యేకంగా ప్రదర్శించింది పెళ్లికి వచ్చిన శాంత ఎదుట. రకరకాల నెక్లేసులూ, గొలుసులూ, రవ్వల గాజులూ, వడ్డాణమూ, వంకీలు ఇలా ఎన్నో రకాల ఆభరణాలను కళ్లు పెద్దవి చేసుకుని మరీ చూసింది శాంత. అన్ని ఆభరణాలలోనూ ఆ పల్లెపడుచుని అమితంగా ఆకర్షించింది ఓ నాలుగు పేటల చంద్రహారం. ఆ చంద్రహారం పట్ల మక్కువతో, "కౌసల్యా, దీనిని ఓసారి వేసుకోనా?" అంది అమాయకంగా.

కస్సుమంది కౌసల్య! "సరిలే! ఇది కొత్త నగ! నీతో ప్రారంభోత్సవమా, తల్లీ?" అంటూ శాంత చేతుల్లోంచి లాక్కుంది కౌసల్య.

చిన్నబుచ్చుకుని తల దించుకుంది శాంత. "ఇతర ఆభరణాలేవీ ఒద్దు కానీ ఇటువంటి చంద్రహారం ఒకటి తన పెళ్లికి చేయిస్తే బాగుణ్ణు" ఇంటికి తిరిగి వస్తూ అనుకుంది.

కానీ అలా జరగలేదు. ఒంటిపేట గొలుసుతోనే సరిపెట్టుకోవలసి వచ్చింది. ఆనాటి నుండి పరిస్థితులతో రాజీ పడడం అలవాటు చేసుకుంది. సంసార జీవితంలో పడిన తర్వాత వరుస కాన్పులతో ఇద్దరు అమ్మాయిలూ, ఆ తర్వాత అబ్బాయి, వాళ్ల చదువులూ, ఆడపిల్లల పెళ్లిళ్లూ ఈ ఒడిదుడుకులన్నింటినీ భర్త చాలీచాలని జీతంతో నెట్టుకు రావలసి వచ్చింది. ఈ సమస్యలలో ఇక చిన్ననాటి కోరిక గూర్చి ఆలోచించే తీరిక లేకపోయింది.

పెళ్లయిన కొత్తలో పుట్టింటికి వచ్చినప్పుడు అప్పుడప్పుడు కౌసల్య తారసపడేది. శాంతను ఊరించడానికి ఆమెకు కనిపించేటట్టు బాహాటంగా ఆ చంద్రహారాన్ని మెడలో వేసుకునేది. అంతేకాదు, ఓ కార్తీక పౌర్ణమి నాడు చెరువులో దీపాలు విడిచి పెట్టడానికి అందరూ కలుసుకున్నప్పుడు "ఏమే శాంతా, చంద్రహారం చేయించుకుంటానన్నావుగా. ఇంకా చేయించలేదా మీ ఆయన?" అని ఎగతాళి చేసింది. మౌనంగా ఉండిపోయింది శాంత. అలా కౌసల్య ఎదురుపడినప్పుడల్లా మనసు పొరల్లో ఏ మూలనో మరుగున పడి ఉన్న కోరిక మళ్లా తలెత్తేది. ఈ జీవితానికిక అది తీరని కోరికే అనుకుని సమాధానపడిపోయింది కొన్నాళ్లకు. దూర ప్రాంతానికి భర్త బదిలీ అయిపోవడంతో కౌసల్య పుట్టింటికి రావడం మానుకుంది. ఇక కౌసల్యని చూడడం తటస్థించలేదు శాంతకు.

అదృష్టం బాగుండి అబ్బాయి మంచి చదువు చదువుకుని పెద్ద ఉద్యోగస్తుడయ్యాడు. అయితే, ఏదో విధంగా దురదృష్టం కూడా వెన్నంటే ఉంటోంది శాంతకు. అబ్బాయి అంది వచ్చేసరికి ఐదోతనం అడుగంటింది. కానీ, అనుకూలవతి అయిన కోడలి సపర్యలతో, మనవడి చిలిపి చేష్టలతో హాయిగా గడిచిపోతోంది జీవితం.

* * *

ఈ పరిస్థితులలో వచ్చింది హఠాత్తుగా చిన్ననాటి స్నేహితురాలు కౌసల్య దగ్గర నుండి ఉత్తరం, ఒక వారం రోజులలో వస్తున్నాననే వార్తతో! ఆనందంతో మనసూగిపోయింది. ఏనాటి కౌసల్య?! ఎన్నాళ్లో అయిపోయింది ఆమెను చూసి. ఆమె పట్ల ఎంతటి నిరసన భావం ఉన్నా ఆమెలో తననాకట్టుకునే శక్తి ఏదో ఉందేది. ఆనాటి నేస్తం మరో నాల్రోజులలో రాబోతోంది. అలనాటి కోరికకి కప్పిన నివురు మళ్లా

తొలగసాగింది.

ఆలోచనలతో తలమునకలవుతోంది శాంత. ఈనాడు తనకేం కావల్సినా అమర్చిపెట్టే కొడుకూ, కోడలూ ఉన్నారు. కానీ ఈ వయసులో తనకి 'ఫలానా' వస్తువు కావాలని చెప్పడానికి మొహ మాటం ఒక వైపూ, కౌసల్య వచ్చేసరికి దాన్ని మెడలో అలంకరించుకుని గర్వంగా చూపించాలనే తలంపు మరోవైపూ ఒక రోజంతా సతమతమైంది శాంత. చివ రకు చిన్ననాటి కోరికదే గెలుపైంది. సందేహిస్తూనే కోడలితో చెప్పింది.

చిన్నగా నవ్వింది కోడలు. "ఈ రోజుల్లో ఎవరూ వేసుకోరు అత్తయ్యా అటువంటి ఆభరణాలు" అంది.

నిరాశతో కలత చెందింది మనసు కోడలి సమా ధానం విని. సిగ్గుతో తల వంచుకోవలసి వచ్చింది తొందరపడి తన పిచ్చికోరిక వెలిబుచ్చినందుకు. లోలోపల కుమిలిపోయింది. "ఏం చెప్పినా అమర్చి పెడుతుంది కోడలు" అనే తన అంచనా తలక్రిందులై నందుకు బాధ పడింది. సుమారు యాభై వేలు ఖరీదు చేసే ఆభరణం ఓ అగ్గిపెట్టె కొని తెమ్మన్నంత కాకతా ళీయంగా చెప్పేసింది తను. అంత స్వల్ప వ్యవధిలో అంత సొమ్ము సర్దుబాటు కావద్దూ? తన ఆదుర్దా తనది! సాధ్యాసాధ్యాలు ఆలోచించలేకపోయింది.

అత్తగారు నిరుత్సాహపడడం గ్రహించింది కోడలు. "మీరంతగా ఇష్టప డుతున్నారు కనుక మీ అబ్బాయి రాగానే చెప్తాను. దిగులు పడకండి. నాల్రోజుల్లో మీరు కోరు కున్న ఆభరణం మీ చేతుల్లో ఉంచే పూచీ నాది" అని అభయమిచ్చింది.

ఒక్కసారిగా గుండె బరువు తగ్గింది శాంతకి. కొన్ని క్షణాలు ఎంతగానో మథనపడిపోయిన మన సుకి కోడలి మాటలు ఊరట కలిగించాయి. "ఈ జీవి తానికీ భాగ్యం చాలు, భగవంతుడా" చెమ్మగిల్లిన కళ్లని కోడలికి కనిపించకుండా చీరకొంగుతో ఒత్తు కుంటూ అనుకుంది.

ఆ మర్నాడే అబ్బాయి ఆ నగ కోసం ఆర్డరు పుర మాయించి, డబ్బు కట్టేసి రశీదు చేతిలో పెట్టేడు.

"నాల్రోజుల్లో నీ చంద్రహారం ఇచ్చేస్తానన్నా డమ్మా" అని కొడుకు చెప్తూంటే అప్పుడే ఆ చంద్ర హారం మెడలో వేసుకున్నట్టే సంబరపడిపోయింది.

* * *

అనుకున్నవన్నీ అనుకున్నట్టు జరగవు. అనుకున్న సమయానికి చంద్రహారం అందలేదు శాంతకి. మరో రెండు రోజులు వాయిదా వేశాడు షాపువాడు. కౌసల్య వచ్చేసరికి తన మెడలో చంద్రహారాన్ని అలంకరించు కోలేకపోతున్నందుకు కాస్త నిరుత్సాహ పడినా, ఆమె ఉండగానే ఆ ఆభరణం తన చేతికందబోతోంది కదా అని సరి పెట్టుకుంది తర్వాత.

అనుకున్న రోజుకే వచ్చింది కౌసల్య. ఆమెను చూసీ చూడగానే నివ్వె రబోయింది శాంత. ఈమె తన నేస్తం కౌసల్య కాదు. ఖరీదైన దుస్తులలో మిలమిలా మెరిసి పోయే కౌసల్య ఎక్కడ? సాదా నూలు చీరలో, ముడు తలు పడిన ముఖంతో వెలవెలబోతున్న ఈమెక్కడ? ఎప్పుడూ చలాకీగా, దర్పం మూర్తీభవించిన ఆ కళ్లకీ, నిస్తేజంగా పాలిపోయిన ఈ కళ్లకీ పోలికెక్కడ? తను కౌసల్యని చూసి పట్టుమని పదేళ్లయినా కాలేదు. ఈ పదేళ్ల కాలం ఆమెలో ఇంత మార్పు తెస్తుందా? అసం భవం! నమ్మశక్యం కావడం లేదు. కానీ ఎట్ట ఎదుట నేనే కౌసల్యనంటూ నిలబడిన వ్యక్తిని కాదనడం ఎలా? ఏమిటీ ఘోరం?

ఆక్రోశిస్తున్న మనసుని అదుపులో పెట్టడానికి ప్రయ త్నిస్తూ "కౌసల్యా...!" అంటూ ఎదురె



ళ్లింది శాంత.

ఎన్ని యుగాల నుండో ఆప్యాయతతో నిండిన ఆ పిలుపు కోసమే ఎదురుచూస్తున్నట్టు ఆమెని వాటేసుకుంది కౌసల్య!

"ఏ..మి..టే ఇలా అయిపోయావ్?" అంది శాంత ఆమె తలని తన గుండెలకు హత్తుకుంటూ.

* * *

తర్వాత కౌసల్య చెప్పిన మాటలు విన్న శాంతకు నిలువునా భూమిలోకి కృంగిపోతున్నట్టనిపించింది.

ఆమెకు కేన్సర్! నెలల్లోంచి రోజుల్లో పడింది ఆమె బ్రతుకు. భర్త చనిపోయి చాలా కాలమైంది. అప్రయోజకుడైన కొడుకు ఆస్తినంతటినీ హారతి కర్పూరం చేసేసి అత్తవారింట్లో తలదాచుకుంటున్నాడు. అన్నావదినల సూటిపోటి మాటలు భరిస్తూ చివరి ఘడియ కోసం ఎదురుచూస్తోంది. చనిపోయే ముందు చిన్ననాటి నేస్తాన్ని క్షమాభిక్ష వేడుకుని తనువు చాలించాలనే తలంపుతో వచ్చిన నెచ్చెలిని వ్యథతో అక్కున చేర్చుకుంది శాంత. కౌసల్య పట్ల ఆమెకు కొంత ద్వేష భావం ఉండడం వాస్తవమే! కానీ ఆమెకు ఇంతటి శిక్షను ఏనాడూ కోరుకోలేదా అమాయకురాలు.

"కౌసల్యా, ఆ నరక కూపానికి నిన్ను పంపించలేను. నా దగ్గరే ఉండిపోవే!" నీళ్లు నిండిన కళ్లతో అడిగింది ఆ సాయంత్రం.


శాంతను నిశితంగా చూసింది కౌసల్య. అనురాగం, అభిమానం కలసి మూర్తీభవించిన దేవతామూర్తిలా కనిపించింది శాంత.

"పిచ్చి శాంతా, మంచితనానికి కూడా ఓ హద్దు ఉండాలి. దేవతల్ని ఎవరు చూశారు? నేను ఎంతో అదృష్టవంతురాల్ని! ఒక దేవతను చూడగలిగాను" శాంత చేతుల్ని కళ్లకద్దుకుంటూ అంది కౌసల్య.

శాంత చూపుల నుండి ఆ క్షణంలో తప్పించుకోవాలని, "చూద్దాంలే అప్పుడే వెళ్లిపోను. సరేనా?" అంది కౌసల్య.

"నువ్వు అలా ఆషామాషీగా అంటే కుదర్దు. ఇక్కడే ఉండిపో. ఈ చివరి రోజుల్లో నీకే లోటూ రాకుండా..." ఉప్పెనలా ఎగసిన దుఃఖపు తెరలు ఆమె మాటలకవరోధాలయ్యాయి.

పొంగి ప్రవహించే మంచితనం భగవత్సాక్షాత్కా



రాన్ని మరపిస్తుందట! పసిపిల్లలా ఒదిగిపోయింది కౌసల్య నెచ్చెలి ఒడిలో.

* * *

"బాబూ, ఆ హారం నాకొద్దు. ఆర్డర్ కేన్సిల్ చేసేసి డబ్బు వాపసు తీసుకో" కొడుకు ఆఫీసుకి బయలుదేరుతూండగా పరుగులాంటి నడకతో వచ్చి రశీదు ఇస్తూ అంది శాంత. కౌసల్య పెరట్లో స్నానం చేస్తోంది.

"అది రెడీ అయిపోయి ఉంటుందమ్మా. ఇప్పుడు కేన్సిల్ చేస్తే మనం కొంత నష్టం భరించవలసి వస్తుంది" తల్లి మాటలు విని ఆశ్చర్యపోతూ అన్నాడతడు.

"నా కోసం ఆ మాత్రం నష్టం భరించలేవా, నాన్నా?" ఆమె గొంతులోని వ్యథను గుర్తించి కంగారుపడ్డాడు.

"తనేమైనా అన్నదా, అమ్మా?" అనుమానంగా అడిగాడు అంత డబ్బు వెచ్చించినందుకు భార్య ఏమైనా అందేమోనని.

"ఛ! నా కోడలు బంగారు తల్లి!! ఆమె ఏమీ అనలేదు. నీకా సందేహం ఎందుకొచ్చిందీ? నేనెందుకు చెప్తున్నానో నీకిప్పుడు అర్థం కాదు. తర్వాత అంతా చెప్తాను. ఈ ఒక్కసారికి నా మాట విను. ఆ హారాన్ని నువ్వు ఇంటికి తీసుకురావడానికి వీల్లేదు."

"అలాగేనమ్మా" అని అతడు వెళ్లిపోయాడు. శాంత మనసు స్థిమితపడింది. తన చిన్ననాటి చిన్ని.. చిన్ని.. ఆశ నెరవేరకపోవడం ఆమెకు సంతృప్తినే మిగిల్చింది.

కాలసర్పమై విధి వేసిన కాటుకి విలవిలలాడుతున్న నెచ్చెలి మదిలో మెదలగా కళ్లు మూసుకుంది బాధతో.

☆



## మరో కోల్డ్‌వార్!

*బాలీవుడ్ హీరోయిన్లలో కొంతమంది మధ్య 'కోల్డ్‌వార్' నడవడం మామూలే. తాజాగా అశిన్-జియాఖాన్‌ల మధ్య ఇలాంటిదే జరిగే అవకాశం వుందంటున్నారు సినీజనాలు. 'గజినీ' సినిమా పబ్లిసిటీలో జియాఖాన్‌ని చూపించకపోవడం వెనక ఆమీర్ ఖాన్ స్ట్రేటజీ వుందని భావిస్తున్నారు. అసలు అశిన్ కూడా పబ్లిసిటీ అంతగా కనిపించలేదు. కొన్ని వారాల తర్వాత జియాఖాన్‌ని రంగంలోకి దించాలనేది ఆమీర్ ప్లాన్ అట. ఏదేమైనా ఈ సినిమా పబ్లిసిటీ తనకంటే అశిన్ కొంతయినా ముందుండడం జియాకి కొంచెం 'చిరాకు' కలిగించే సంగతే కదా!*